నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 27 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

## సైబర్ నేరగాళ్ల కొత్త మోసం

- సైబర్ క్రైమ్ ఆఫీసర్లమంటూ ఫోన్
- డ్రగ్స్ కేసులో కొడుకు అరెస్ట్, వదిలేయాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండ్
- లేదంటే మీడియా ముందు ప్రవేశపెడతామంటూ బెదిరింపు

బీబీనగర్, నవంబర్ 26 : సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ క్రైం ఆఫీసర్లమంటూ ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పంజాల సురేశ్‌గౌడ్‌కు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి డీఎస్పీ విక్రమ్ సైబర్ క్రైమ్ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నాను అంటూ తన కొడుకు అరగంట ముందు డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయ్యాడని, తమ కస్టడీలో ఉన్నాడని, అతన్ని వదిలేయాలంటే ఆఫీసర్‌కు రూ.50 వేలు ఖర్చు అవుతుందని తెలిపాడు. ఆఫీసర్ నంబర్ చెప్తాను అతనికి డబ్బులు ఫోన్‌పే చేయాలని, లేదంటే అతన్ని ఢిల్లీ తీసుకెళ్లి మీడియా ముందు ప్రవేశ పెడతానంటూ బెదిరించాడు. తన కొడుకుతో మాట్లాడించాలని అడుగగా గుర్తు తెలియని వ్యక్తితో మాట్లాడించారు. ఆఫీసుకు వచ్చి కలుస్తానని సమాధానం ఇవ్వడంతో ఢిల్లీ తీసుకెళ్తున్నానని డబ్బులు చెల్లించి తన కొడుకుని తీసుకెళ్లాలన్నారు. మాట్లాడుతుండగా ఫోన్ కట్ చేయగా ప్రతి గంటకు ఒకసారి ఫోన్ చేసి తిడుతూ డబ్బులు పంపించాలని డిమాండ్ చేశారు. అదే పనిగా వస్తున్న ఫోన్లతో భరించలేక బాధితుడు ఆ నంబర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాడు.



భువనగిరిలో దీక్షా దివస్ సన్నాహక కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

# దీక్షా దివస్ స్ఫూర్తితో పోరాడాలి..

## 'తెలంగాణ' రక్షణకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి

- రేవంత్ రెడ్డి పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు
- దీక్షా దివస్‌తోనే నేడు కాంగ్రెస్ నేతలకు పదవులు
- కేసీఆర్ అంటేనే తెలంగాణ పేగు బంధం
- ఆయన పోరాటం, గొప్పతనాన్ని యువతకు తెలియజేయాలి
- మళ్లీ అధికారం బీఆర్‌ఎస్‌దే.. ముఖ్యమంత్రి కేసీఆరే..
- దీక్షా దివస్‌ను బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి
- భువనగిరిలో సన్నాహక సమావేశం.. బీఆర్‌ఎస్ నేతల హాజరు

ఉయాదాద్రి భువనగిరి, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు దీక్షా దివస్‌తో ప్రాణ త్యాగానికి సిద్ధమైన కేసీఆర్ స్ఫూర్తితో నాశనమవుతున్న తెలంగాణకు కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. నయవంచక రేవంత్ రెడ్డి పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు చేపట్టాలని కోరారు. కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే నేడు కాంగ్రెస్ నేతలు పదవులను అనుభవిస్తున్నారని చెప్పారు. పాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రపంచ చరిత్రలో స్థాయిని మరిచి, అడ్డగోలుగా తిట్టే ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అని దుయ్యబట్టారు. భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన దీక్షా దివస్ కార్యక్రమ సన్నాహక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో తెలంగాణ వనరులను దోచుకున్నారని, నీళ్లు, నిధులు, నియామకాల్లో అన్యాయం జరిగిందన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిందంటే దానికి కారణం కేవలం కేసీఆర్ మాత్రమే అని చెప్పారు. నాడు చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. రాష్ట్ర సాధన కోసం శాంతియుతంగా పోరాటాలు చేశామని, పదవులు ముఖ్యం కాదని తెలంగాణ కోసం రాజీనామా చేసి, ఉద్యమ ఆకాంక్షలను బలంగా వినిపించామన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించిన మహానుభావుడు కేసీఆర్ అని చెప్పారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేండ్లుగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కేసీఆర్ అంటేనే తెలంగాణ పేగు బంధం అని అన్నారు. కేసీఆర్ పోరాట పటిమ, గొప్పతనాన్ని ఈ తరం యువతకు తెలియజేయాలని కోరారు. కల్లిబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో విలన్ పాలన నడుస్తున్నదని, రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ సీఎం అవ్వడం ఖాయమని తెలిపారు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌ను బీఆర్‌ఎస్ శ్రేణులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, భువనగిరి, ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎనబోయిన ఆంజనేయులు, వస్పరి శంకరయ్య, బీఆర్‌ఎస్ నేతలు తుంగ బాలు, శ్రీకర్ రెడ్డి, గాది నరేందర్ రెడ్డి, కొలుపుల అమరేందర్, ఏవీ కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, జనగాం పాండు తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధన : ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి



2009 డిసెంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతోనే తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరిందని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. ఆయన దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేసిందని గుర్తుచేశారు. పదేండ్లు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎలాంటి లోటు లేకుండా పాలన అందించించారని చెప్పారు. ఉద్యమ సమయంలో ఆలేరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించి ప్రజలు ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తు చేశారు. మరోసారి ఉద్యమ స్ఫూర్తి ప్రదర్శించాలని, ఆలేరు నియోజకవర్గం నుంచి దీక్షా దివస్‌కు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

### ఉద్యమ జ్ఞాపకాలను ఆవిష్కరించాలి : ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



భువనగిరిలో దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గులాబీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 29న కేసీఆర్ దీక్షకు సంబంధించి ఫొటో ప్రదర్శన చేయాలని, ఉద్యమ జ్ఞాపకాలను ఆవిష్కరించాలన్నారు. కాంగ్రెస్ దిమ్మదిరిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

### దీక్షా దివస్.. ఓ ఉద్యమ కెరటం : భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను యావత్ భారత దేశానికి చాటి చెప్పిన రోజు దీక్షా దివస్ అని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. చావో రేవో అంటూ కేసీఆర్ తన ప్రాణాలను లెక్కజేయకుండా తెలంగాణ కోసం ఆమరణ దీక్షకు దిగారని గుర్తు చేశారు. ఇది తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఒక చిరస్మరణీయమైన రోజు అని తెలిపారు. అణిచివేతలతో ప్రజా ఉద్యమాలను అణగదొక్కలేరంటూ తెలంగాణ పోరాట వారసత్వాన్ని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పిన రోజు అని అన్నారు. ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### యావత్ తెలంగాణ కేసీఆర్ వెంటే : నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ఢిల్లీ మెడలు వచ్చి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. తెలంగాణ ఇచ్చుడో.. కేసీఆర్ ఇచ్చుడో అనే నినాదంతో రాష్ట్రాన్ని సాధించి పెట్టారని గుర్తుచేశారు. దీక్ష దివస్ సబ్బండ వర్గాలను ఏకం చేసిందని, భారత దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిందన్నారు. ఆ రోజు తెలంగాణ ఉద్యమ గతిని మార్చేసిందని తెలిపారు. యావత్ తెలంగాణ కేసీఆర్ వెంట నడవడంతో కేంద్రం మెడలు వంచి.. తెలంగాణ సాధించుకోగలిగామని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు దీక్షా దివస్‌కు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు.

### దీక్షా దివస్‌కు స్వచ్ఛందంగా తరలిరావాలి : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్



దీక్షా దివస్‌కు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో దీక్షా దివస్ చిరస్మరణీయమైన రోజు, కొత్త శకానికి నాంది పలికిన రోజు అని అన్నారు. తెలంగాణ అమరుల త్యాగాలు, జ్ఞాపకాలు, పోరాటాలను గుర్తు చేసుకుందామని తెలిపారు. ఉమ్మడి పాలనలోనే ఆంధ్రా పాలకులకు ఎదురొడ్డి కొట్లాడామని, ఇప్పుడు రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని చెప్పారు. అతి తక్కువ సమయంలోనే సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ఎత్తి చూపాలని తెలిపారు.

### కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర ప్రకటన : మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



''బక్క పలుచని వ్యక్తితో అయ్యేది లేదు.. పొయ్యేది లేదు.. తెలంగాణ వచ్చేది లేదు'' అంటూ ఎగతాళి చేసిన వాళ్ల ముఖం కేసీఆర్ సంకల్ప బలం ముందు చిన్నబోయిందని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ అన్నారు. కేసీఆర్ దీక్షతోనే అప్పటి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగి తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలు దీక్షా దివస్‌లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలపై అమానుషంగా ప్రవర్తిస్తున్నదని, అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం దమనకాండను మానుకోవాలని హెచ్చరించారు.

### 5వేలమందితో దీక్షా దివస్ : బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



జిల్లా కేంద్రంలో ఐదు వేల మందితో పెద్దఎత్తున దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి తెలిపారు. నాటి ఉద్యమ గుర్తులను ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా డిస్‌ప్లే చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆయా మండలాలకు బాధ్యులను నియమించామన్నారు. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై 11 నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

### కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు : మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని దేశానికే ఓ రోల్ మోడల్‌గా తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు రాష్ట్రంలో కనిపిస్తున్నాయని, ప్రజా వ్యతిరేక చర్యలను తిప్పికొట్టాలన్నారు. చౌటుప్పల్, నారాయణపురం మండలాల నుంచి 500 మంది పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### పెద్ద ఎత్తున తరలిరావాలి : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి



కేసీఆర్ కృషి వల్లే తెలంగాణ సాధించుకున్నామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆనాడు ఆంధ్ర పాలకులకు వ్యతిరేకంగా నీళ్లు, నిధులు, నియామకాల కోసం నిర్విరామంగా పోరాడారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి రాష్ట్ర ఏర్పాటులో భాగస్వామం చేశారన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసి.. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారని తెలిపారు. దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.





సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

## రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, నవంబర్ 26 : భారత రాజ్యాంగ ముసాయిదా సమర్పించిన రోజు చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సం, జాతీయ చట్ట దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ, బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా చూడాలన్నారు. న్యాయసేవ అధికార చట్టంలో పేదవారికి ఉచిత న్యాయసహాయం అందిస్తున్నామని, దీనికై ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు. ఉచిత న్యాయ సహయం కోసం 15100 టోల్‌ఫ్రీలో నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు. అనంతరం పట్టణంలోని బీచ్‌మహల్ల ఏరియాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, విధులు, విద్యార్థి పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.హరినాథ్, ఉపాధ్యక్షురాలు కె.జయ, కార్యదర్శి కృష్ణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



భువనగిరి గంజ్ ఏరియాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూరలు వడ్డిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, నవంబర్ 26 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భువనగిరి పట్టణంలోని గంజ్ ఏరియాలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. వంట గది, వండిన అన్నం, కూరలను పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. అన్నం ఏ విధంగా ఉందోనని భోజనం చేస్తున్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజన విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి లేకుండా బోధించాలన్నారు. చదువులో వెనుకపడుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. మన ఊరు-మన బడిలో అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఈఈకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేణుక, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు మూర్తి, శ్రీవాణి, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

## సీజ్ చేసిన కంపెనీలో సింథటిక్ డ్రగ్స్ తయారీ

- ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు
- రెండు కార్లలో తరలిస్తుండగా పట్టివేత
- రూ.24 కోట్లకు పైగా విలువ చేసే 100 కేజీల సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం

భువనగిరి అర్బన్/యాదగిరిగుట్ట, నవంబర్ 26 : సీజ్ చేసిన కంపెనీలో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసిన సింథటిక్ డ్రగ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న ముఠాను పక్కా ప్లాన్‌తో అరెస్టు చేసినట్లు యాదాద్రి భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర వెల్లడించారు. డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వాటి వివరాలు తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ గ్రామానికి చెందిన భానుప్రసాద్, రామాజీపేటకు చెందిన వాసుదేవచారిలకు యాదాద్రి లైఫ్ సైన్సెస్ కెమికల్ కంపెనీ రామాజీపేట గ్రామ పరిధిలో ఉన్నది. ఈ కంపెనీని నిబంధనలకు విరుద్ధంగా నడపడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మూడుసార్లు సీజ్ చేశారు. దీంతో కంపెనీ యాజమాన్యం పూర్తిగా నష్టాల్లో పడింది. యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూర్‌కు చెందిన నేతి కృష్ణారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవాడు. ఈ సమయంలో హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన ఇస్మాయిల్‌తో కృష్ణారెడ్డికి పరిచయం ఏర్పడింది. ముంబయిలో తనకు తెలిసిన వారికి డ్రగ్స్ (ఎఫిడ్రిన్, మెఫెడ్రోన్) కావాలని తాను సరఫరా చేస్తానని, ఈ డ్రగ్స్‌తో అధికంగా డబ్బులు సంపాదించవచ్చునని చెప్పాడు. కృష్ణారెడ్డి తన క్లాస్‌మేట్ భానుప్రసాద్ ఉన్నాడని, అతనికి కెమికల్ తయారు చేసే కంపెనీ ఉందని తెలిపారు. భానుప్రసాద్ పార్ట్నర్ అయిన కంపెనీ మరో యాజమాని వాసుదేవచారికి డ్రగ్స్ తయారు విషయం చెప్పడంతో వాసుదేవచారి ఒప్పుకున్నాడు. కాగా ఈ డ్రగ్స్ తయారు చేయడానికి వ్యక్తి కావాలని వెతికేలోపు సత్యనారాయణ గతంలో ఒక కెమికల్ కంపెనీలో 10 సంవత్సరాలు పనిచేశాడని, అతను తనకు స్నేహితుడని కృష్ణారెడ్డి భానుప్రసాద్‌తో తెలిపాడు. భానుప్రసాద్ డ్రగ్స్ తయారు విషయాన్ని కృష్ణారెడ్డికి ప్లాన్ ప్రకారం చెప్పాడు. పథకం ప్రకారం డ్రగ్ ఎఫిడ్రిన్, మెఫెడ్రోన్ తయారీకి ముడిసరుకును సేకరించి సత్యనారాయణ కంపెనీలో తయారు చేస్తున్నాడు. ఈ క్రమంలో ముంబయికి చెందిన ఫైజన్ అహ్మద్, ఇసార్ అహ్మద్ వద్ద పనిచేసే తన స్నేహితుడైన సల్మాన్ షేక్‌డోలా హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఉండే ఇస్మాయిల్ డ్రగ్స్‌ను గతంలో రెండు, మూడుసార్లు సరఫరా చేశాడు. కాగా మరోసారి 100 కేజీల డ్రగ్స్ కావాలని సల్మాన్ షేక్‌డోలా ఆర్డర్ చేయగా తయారు చేసిన డ్రగ్స్‌ను ఈ నెల 25న రెండు కార్లలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. కారులో తరలించే క్రమంలో కారు డ్రైవర్ సీహెచ్ సునీల్ కారులో ముందుగా వెళ్తూ వెనక నుంచి వచ్చే కారుకు దారిని చూపిస్తూ డ్రగ్స్‌ను రాష్ట్రం నుంచి ముంబయికి తరలించేవారు.

### పక్కా సమాచారంతో రెక్కీ..

యాదాద్రి లైఫ్ సైన్స్ కెమికల్ కంపెనీలో తయారు చేసిన 100 కేజీల డ్రగ్స్‌ను రెండు కారులో తరలిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్‌బ్యూరో పోలీసులు, యాదాద్రి భువనగిరి పరిధిలోని రాచకొండ పోలీసులతో కలిసి బీబీనగర్ టోల్ గేట్ వద్ద, టోల్‌గేట్‌కు ముందున్న రైల్వే అండర్‌పాస్ వద్ద రెండుచోట్ల రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలో ముందు కారులో వస్తున్న సీహెచ్ సునీల్ వెనుక నుంచి డ్రగ్స్ తీసుకువస్తున్న కారుకు దారి చూపిస్తూ టోల్ గేట్ వద్ద పోలీసులు ఉంటారని ముందుగా ఊహించి టోల్‌గేట్‌కు ముందున్న రైల్వే అండర్ పాస్ రోడ్డు మార్గం నుంచి వెళ్లానని చెప్పాడు. దీంతో డ్రగ్స్ తరలిస్తున్న కారును అండర్‌పాస్ నుంచి తరలిస్తున్న క్రమంలో రెక్కీ నిర్వహించిన పోలీసులు కారును ఆపగా పొంతన లేకుండా వివరాలు చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అక్రమంగా తయారు చేసిన 100 కేజీల డ్రగ్స్‌తో పాటు రెండు కార్లు సీజ్ చేయగా, నేతి కృష్ణారెడ్డి, ముంబయికి చెందిన ఫైజాన్ అహ్మద్, డ్రైవర్ సునీల్‌ను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర వెల్లడించారు. కంపెనీ యాజమాని రామాజిపేటకు చెందిన వాసుదేవచారి, పెద్ద కందుకూర్‌కు భానుప్రసాద్, ముంబాయికి చెందిన సల్మాన్‌షేక్‌డోలా పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఈ డ్రగ్స్ తయారు చేసిన కంపనీలో మరోక పార్టీకి అందజేసేందుకు నిల్వ ఉంచిన 15 కేజీల డ్రగ్స్, వాటికి ఉపయోగించిన యంత్రాలను సీజ్ చేశామని, కంపెనీలో ప్రస్తుతం సోదాలు జరుగుతున్నాయని, ఇందుకు సహకరించిన అంచనా మేరకు సుమారు 40 మంది ఉంటారని, వారిని అరెస్టు చేసేందుకు పక్కా ప్లాన్‌తో ఉన్నామని చెప్పారు. డ్రగ్స్ తరలిస్తున్న వారిని చాకచక్యంగా అరెస్టు చేసేందుకు విధులు నిర్వహించిన తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.రమేశ్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు జయరాజు, నవీన్‌కాంత్, కానిస్టేబుళ్లు మధు, ఉదయ్‌ను అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీలు రవికిరణ్‌రెడ్డి, చంద్రబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.